## 8న జాబ్‌మేళా

జగిత్యాల/ కమాన్‌చౌరస్తా, ఆగస్టు 5 : కరీంనగర్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఈ నెల 8న హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ సహకారంతో కలెక్టర్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని కరీంనగర్ డీఐఈవో జగన్మోహన్‌రెడ్డి, జగిత్యాల డీఐఈవో నారాయణ సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. 2023 –24 సంవత్సరంలో 75% ఉత్తీర్ణతతో ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన బైపీసీ, సీఈసీ, వొకేషనల్ (కంప్యూటర్ సైన్స్) విద్యార్థులు అర్హులని సూచించారు. సెలెక్ట్ అయిన వాళ్లకి జీతంతోపాటు ప్రముఖ యూనివర్సిటీలో డిగ్రీ బీకాం, బీఎస్సీ వంటి కోర్సులు కూడా చేయవచ్చని తెలిపారు. మేళాలో పాల్గొనే విద్యార్థులు ఎస్సెస్సీ, ఇంటర్ మెమోలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్ కార్డు జిరాక్స్, ఆండ్రాయిడ్ మొబైల్ తీసుకువెళ్లాలని, మరిన్ని వివరాలకు క్లస్టర్ లీడ్ నరేశ్‌ను 7569177071 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

## జైలు పాలు చేసిన వీడియో

- ఉడుము కోసి వండుతున్న వీడియో క్లిప్పింగ్ వైరల్
- కేసు నమోదు చేయాలని డీఎఫ్‌వోకు ఫిర్యాదు
- 15 రోజుల పాటు రిమాండ్

మల్యాల, ఆగస్టు 5 : ఉడుమును పట్టి కోసి కూర వండుతూ తీసిన వీడియోతో ఇద్దరు జైలుపాలయ్యారు. కొడిమ్యాల అటవీశాఖ రేంజ్ అధికారి గులాం నయీమొద్దీన్ వివరాల ప్రకారం.. మల్యాల మండలం ముత్యంపేటకు చెందిన దనవేని జప్పయ్య, రావుల దుర్గయ్య కొండగట్టు అటవీ సెక్షన్ పరిధిలో ఉడుములను వేటాడుతూ, వాటిని అమ్ముతూ ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారు. ఈ క్రమంలో ఉడుములు పట్టిన వారు ఓ రోజు వాటిని శుభ్రపరిచి కోసే విధానం నుంచి వంట వండే వరకు ప్రత్యేకంగా ఓ వీడియోను రూపొందించి పలు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. ఈ వీడియోను 'ఏ గౌతం స్టే యానిమల్ ఆఫ్ ఇండియా' అనే స్వచ్ఛంధ సంస్థ సభ్యులు చూసి ఇన్‌స్టాగ్రాంలోని ఐడీ ఆధారంగా వివరాలు కనుక్కొని కొడిమ్యాల రేంజ్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా అటవీ సిబ్బంది విచారణ చేపట్టగా దనవేని జప్పయ్య, రావుల దుర్గయ్యపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేశారు. వారిని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 15 రోజుల రిమాండ్ విధించడంతో జగిత్యాల సబ్‌జైలుకు తరలించారు. ఫారెస్ట్ రేంజర్ వెంట డిప్యూటీ రేంజర్ మౌనిక, బీట్ ఆఫీసర్ సాయిరాం ఉన్నారు.



నగరంలోని సప్తగిరికాలనీలోని మున్సిపల్ వాహనాల షెడ్ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

# ట్రాక్టర్లకు రిపేర్లేవి?

- నగరపాలక సంస్థలో వాహనాలకు మరమ్మతులు శూన్యం!
- అధికారుల చోద్యం.. అద్దె వాహనాలకు ప్రాధాన్యం
- పెద్ద మొత్తంలో బిల్లులు చెల్లిస్తున్నారనే విమర్శలు
- రిపేర్లు చేయించాలని పారిశుధ్య ట్రాక్టర్ డ్రైవర్ల సమ్మెబాట
- ఈ నెల 8 నుంచి అన్ని విభాగాల కార్మికులు!



షెడ్‌లోనే నిలిచి ఉంచిన ట్రాక్టర్లు

**గోటితో పోయే దానికి గొడ్డలి వరకు తెచ్చుకున్నట్టుగా ఉన్నది నగరపాలక సంస్థ అధికారుల పనితీరు! వివిధ విభాగాల్లో ఉపయోగించే ట్రాక్టర్లకు చిన్న చిన్న రిపేర్లు వచ్చినప్పుడే చేయకుండా చోద్యం చూడడంతో అవి మూలన పడే దుస్థితి వచ్చింది. కొన్ని వాహనాలకు సెల్ఫ్ లేకపోవడంతో ఉదయం ప్రారంభిస్తే సాయంత్రం వరకు ఆఫ్ చేయకుండా నడిపే పరిస్థితి ఉన్నది. పైగా అత్యవసర సమయాల్లో అద్దె వాహనాలకు ప్రాధాన్యమిస్తూ.. అధిక బిల్లులు లేపుతున్నట్టు తెలుస్తున్నది. ఈ క్రమంలో వాహనాలకు మరమ్మతులు చేయించడం లేదని ఆరోపిస్తూ పారిశుధ్య ట్రాక్టర్ డ్రైవర్లు సోమవారం ఉదయం నుంచి సమ్మెలోకి వెళ్లడం సమస్యకు అద్దం పడుతున్నది.**



నగరంలో పేరుకుపోయిన చెత్తాచెదారం

కరీంనగర్ కార్పొరేషన్, ఆగస్టు 5 : కరీంనగర్ నగరపాలక సంస్థలో పారిశుధ్య, టౌన్ ప్లానింగ్, నీటి సరఫరా విభాగంలో వివిధ పనుల కోసం ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. పారిశుధ్య విభాగంలో ట్రాక్టర్లు 46, జేసీబీలు 3, హరితహారం కోసం 8, నీటి సరఫరాకు 7, ఫాగింగ్‌కు రెండు, ల్యాడర్‌కు ఒకటి వాడుతున్నారు. అందులో నీటి సరఫరా కోసం హై లెవల్‌లో నాలుగు, లో లెవల్‌లో నాలుగు ట్రాక్టర్లు ఉపయోగిస్తున్నారు. కాగా అత్యధికగా వాహనాలకు మరమ్మతులు లేకుండా పోతున్నాయి. ముఖ్యంగా ప్రతి రోజూ ఆయా డివిజన్ల నుంచి చెత్తను తీసుకపోయే ట్రాక్టర్లల్లో ఎక్కువ వాహనాలకు రిపేర్లు కరువయ్యాయి. పలు ట్రాక్టర్లకు సెల్ఫ్ లేకపోవడంతో ఉదయం ప్రారంభిస్తే పనులు పూర్తయ్యేంత వరకు ఇంజన్ ఆఫ్ చేయకుండానే నడిపిస్తున్నామని కార్మికులు వాపోతున్నారు. దీని వల్ల వ్యయం పెరగడంతోపాటు ఇతర సమస్యలు వస్తున్నాయని పేర్కొంటున్నారు. కాగా, శానిటేషన్ ట్రాక్టర్లలో పదికి పైగా వాహనాలు రిపేర్లు లేక పక్కన పెట్టినట్టు కార్పొరేటర్లు చెబుతున్నారు. అలాగే మూడు జేసీబీల్లో ఒకటి రిపేర్‌కు రావడంతో దానిని పూర్తిగా పక్కన పెట్టారు. అలాగే నగరంలో రెండు బ్లేడ్ ట్రాక్టర్లలో ఒకటి ఏడాది క్రితమే మూలకు పడగా, ఉన్న ఒక్క ల్యాడర్‌ను ఎప్పటికప్పుడు తాత్కాలికంగా మరమ్మతులు చేయిస్తూ వినియోగిస్తున్నారు. నీటి సరఫరాలో వినియోగించే ఏడు ట్రాక్టర్లలో రెండు మూలన పడ్డాయి. ముఖ్యంగా అధికారులు వాహనాలను కొనుగోలులో చూపుతున్న శ్రద్ధ, వాటిని సక్రమంగా నిర్వహించే విషయంలో చూపడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### అవసరాలకు అద్దె వాహనాలు

ట్రాక్టర్లు రిపేర్లతో మూలనపడుతుండగా, అవసరమైనప్పుడు అద్దె వాహనాలనే దిక్కవుతున్నాయి. వీటికి పెద్ద మొత్తంలో బిల్లులు చెల్లిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా ఏటా వానకాలంలో జేసీబీ, బ్లేడ్ ట్రాక్టర్ల వినియోగం ఎక్కువగా ఉంటుంది. వీటిలో ఎక్కువగా మరమ్మతుల్లోనే ఉండడంతో అత్యవసర పనుల పేరిట ఇంజినీరింగ్ అధికారులు అద్దె వాహనాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అయితే చేసిన పనుల కంటే కూడా అత్యధికంగా బిల్లులు డ్రా చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. అయినా అధికారులు రిపేర్లు చేయించి వినియోగంలోకి తెచ్చే విషయంలో ఆసక్తి చూపడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే బల్దియాకు ఆదాయం మిగిలే అవకాశమున్నది.

### పారిశుధ్య ట్రాక్టర్ డ్రైవర్ల సమ్మె

నగరపాలక సంస్థలో పారిశుధ్య ట్రాక్టర్లకు రిపేర్లు చేయించడంలో అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పారిశుధ్య డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. దీని వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. ఈ మేరకు బీఆర్‌టీయూ, సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 5గంటల నుంచి సమ్మెలోకి వెళ్లారు. సప్తగిరికాలనీలోని నగరపాలక సంస్థ వాహనాల షెడ్ వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ, అనేక ట్రాక్టర్లకు మరమ్మతులు చేయాల్సి ఉన్నదని చెప్పారు. ఏళ్ల తరబడిగా బాగు చేయించాలని తాము కోరుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. అందుకే తాము టోకెన్ సమ్మెకు దిగామని స్పష్టం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాహనాలకు వెంటనే రిపేర్లు చేయించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఈ నెల 8 నుంచి అన్ని విభాగాల కార్మికులు సమ్మెలోకి వస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జనగం రాజమల్లు, రాజయ్య, రూప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

### ఎక్కడికక్కడ నిలిచిన చెత్త

పారిశుధ్య ట్రాక్టర్ డ్రైవర్లు సమ్మెకు దిగడంతో నగరంలో డంప్ పాయింట్ల వద్ద చెత్త పేరుకపోయింది. ప్రతి రోజూ చెత్తను తరలించే ట్రాక్టర్లు ఉదయం నుంచి బయటకు రాకపోవడంతో డివిజన్లల్లోనే నిలిచిపోయింది. అధికారులు వెంటనే స్పందించాల్సిన అవసరమున్నది. లేకపోతే ఈనెల 8 నుంచి అన్ని విభాగాల కార్మికులు సమ్మెలోకి వెళ్తామని చెబుతుండగా, అదే జరిగితే ప్రజలకు ఇబ్బంది ఏర్పడనున్నది.

# నాడు పరవళ్లు.. నేడు కన్నీళ్లు

అడుగంటుతున్న 'ఎగువ మానేరు' ఆశలు



గతేడాది జూలైలో మత్తడి దుంకుతున్న ఎగువ మానేరు



ప్రస్తుతం వెలవెలబోతూ..

- రెండు టీఎంసీలకు ఉన్నది 0.48 టీఎంసీలు
- ఆందోళనలో రైతులు

**కాలం కాకపోవడం.. వరద రాకపోవడం.. కాళేశ్వరం జలాలను సర్కారు ఎత్తిపోయకపోవడంతో ఎగువ మానేరు ప్రాజెక్టులో నీళ్లు అడుగంటాయి. గతేడాది వరకు నిండుకుండను తలపించిన ఈ జలాశయంలో ఇప్పుడు నాలుగో వంతు కూడా నీళ్లు లేకపోవడం.. పోసిన నార్లు ముదిరిపోతుండడంతో రైతులకు కన్నీళ్లు మిగులుతున్నాయి. తరలివచ్చిన గోదావరి జలాలతో గత మూడేళ్లు మత్తడి దుంకగా, ఈసారి వానకాలం ప్రారంభమై రెండు నెలలు గడిచినా చుక్క నీరు రాక వెలవెలబోతున్నది.**



### నార్లు ముదిరిపోతున్నయ్

ఆయకట్టు రైతులందరం ఆరుద్ర కార్తెలో వట్టి వరి నార్లు పోసుకున్నం. వాన కాలం సురువై రెండున్నెళ్లు గడచినా పెద్ద వాన ఇప్పటికి పడలేదు. దీంతో మా మానేరుకు కూడెల్లి, పాల్వంచ వాగుల నుంచి పెద్దగా వరద రాలేదు. గతంల ఎర్రటి ఎండకాలం ఏప్రిల్ నెలలో యాసంగి వరి పంటలు కోసేటప్పుడు కూడా కాళేశ్వరం నీళ్లు వచ్చి మత్తడి దుంకినయ్. ఇప్పుడు మానేరుకు కాళేశ్వరం నీళ్లు ఇడ్తలేరు అంటే బాధనిపిస్తున్నది. వానలు లేవు, కాళేశ్వరం నీళ్లు లేవు, మానేరు కింద పోసిన నార్లు ముదిరిపోతున్నయ్. ఆయకట్టు రైతులను కాంగ్రెస్ సర్కారు పట్టించుకొని న్యాయం చేయాలె

**- శాత్రబోయిన రాజయ్య, రైతు (నర్మాల)**

గంభీరావుపేట, ఆగస్టు 5 : రెండు టీఎంసీల సామర్థ్యమున్న ఎగుమానేరు గతంలో దారుణంగా ఉండేది. కేవలం ఎగువ నుంచి వరద వచ్చినప్పుడే నిండేది. ఏ ఐదేళ్లకో.. పదేళ్లకో మత్తడి దుంకేది. వానకాలం తప్ప ఎప్పుడు చూసినా ఖాళీగా దర్శనమిచ్చేది. ప్రాజెక్టుకు ఎప్పుడూ అరకొర నీళ్లు రావడంతో గంభీరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట మండలాల్లో సుమారు 12 వేల ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారేది. ఇక్కడి రైతుల కష్టాలను కండ్లారా చూసిన నాటి ఉద్యమ నేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ప్రాజెక్టును గోదావరి జలాలతో అభిషేకిస్తామని మాట ఇవ్వడమే కాకుండా కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని తరలించి నెరవేర్చారు. మాజీ మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో 2020 ఏప్రిల్‌లో నట్టెండకాలంలోనే మొదటిసారిగా మల్లన్నసాగర్ నుంచి కూడవెల్లి వాగుద్వారా ఎగువ మానేరుకు గోదావరి జలాలను తరలించి మత్తడి దూకించి ఇక్కడి రైతుల కళ్లల్లో ఆనందం నింపారు. అప్పటి నుంచి గతేడాది జూన్ వరకు మూడేళ్లకు పైగా 365 రోజులూ ఈ ప్రాజెక్టును నిండుకుండలా ఉంచడమే ఏకాకుండా ఆయకట్టుకు జీవం పోశారు. అప్పటి నుంచి రైతులు రెండు సీజన్లలో రందీ లేకుండా పంటలు పండించారు.

### ఉన్నది 0.48 టీఎంసీలే

గతేడాది ఎగువమానేరు నిండుగా కళకళలాడింది. కాళేశ్వరం జలాలకు తోడు వర్షాలు పడడంతో జూన్ నుంచి దాదాపు 45 రోజులపాటు మత్తడి దుంకింది. ఆయకట్టుకు పూర్తి స్థాయిలో భరోసానిచ్చింది. కానీ, ఈ సారి ఆ పరిస్థితి లేకుండా పోయింది. గోదావరి జలాలను ఎత్తిపోయకపోవడం, వానకాలం మొదలై రెండు నెలలు గడిచినా సరైన వర్షాలు లేకపోవడంతో ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి మట్టం తగ్గిపోయింది. రెండు టీఎంసీలకు 0.48 టీఎంసీలు మాత్రమే ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆయకట్టులో నార్లు పోసుకొని ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు. అదును దాటిపోతుండడంతో ఆందోళన చెందుతున్నారు.

### మూడేళ్లు రందీ లేకుండా ఉన్నం



నాకు ఎగువమానేరు ఆయకట్టు కింద నాలుగు ఎకరాల భూమి ఉన్నది. అందులో ఉన్న బోరు మీద ఆశపెట్టుకుని ఈ వానకాలం నాటేసిన. మొన్నటి యాసంగి లెక్కనే మానేరుల వానకాలం నీళ్లు లేకపోతే పంటలు ఎండుతయో.. పండుతయో తెల్వదు. కేసీఆర్, కేటీఆర్ సారు దయతో మూడేళ్లు మానేరు కాల్వ నీళ్లతో రెండు పంటలు రంది లేకుండా పండించుకున్నం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

**- పిట్ల నర్సయ్య, రైతు (నర్మాల)**

### కాళేశ్వర జలాలతో నింపాలి



కేసీఆర్ ప్రభుత్వం గతంలో గోదారి నీళ్లను మానేరుకు తీసువచ్చినట్టు ఇప్పుడు కూడా ఎత్తిపోయాలి. వానలు పడుతలేనందున వారం రోజుల్లో కాళేశ్వరం నీళ్లు మానేరుకు వస్తేనే వానకాలం వరి పంట వేసుకుంటం. మా బంగారు భూములను బీడు పెట్టుకుని విత్తనాలు, పెట్టుబడి నిండా మునిగే కాలం వచ్చింది. రైతులను కష్టపెట్టకుండా మానేరును కాళేశ్వర జలాలతో నింపాలి

**- గొర్రె వెంకటి, రైతు, నర్మాల**

### దూర విద్యా కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలి

తెలంగాణచౌక్, ఆగస్టు 5: అంబేద్కర్ విశ్వ విద్యాలయం దూర విద్యా కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని విశ్వ విద్యాలయం కరీంనగర్ ప్రాంతీయ కేంద్రం కోఆర్డినేటర్, ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ వై సత్యనారాయణ తెలిపారు. విశ్వవిద్యాలయం హైదరాబాద్ సంయుక్త సంచాలకులు డాక్టర్ ఇటిక్యాల రాజేందర్ సోమవారం అధ్యయన కేంద్రాన్ని సందర్శించిన తర్వాత ఆయనతో కలిసి అధ్యాపకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దూర విద్యా కేంద్రంలో అన్ని రకాల కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.కార్యక్రమంలో సీనియర్ కౌన్సిలర్లు పరుశురాం, హరిశంకర్, రాములు, సంజీవం, సిబ్బంది ఉన్నారు.

# ఆరు గ్యారెంటీలు ఉత్తమాటలేనా..?

- ప్రజాపాలన అర్జీలకు కాంగ్రెస్ రిక్త'హస్తం'!
- దరఖాస్తులు ఇచ్చి నెలలు.. దక్కని ప్రయోజనాలు
- పెద్దపల్లి జిల్లాలో 2,17,271 అర్జీలు పెండింగ్
- ఆఫీసుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం శూన్యం
- మండిపడుతున్న ప్రజలు

**ఎన్నికల ముందు 'అది చేస్తాం.. ఇది చేస్తాం' అని నమ్మించి గద్దెనెక్కిన కాంగ్రెస్, ఇప్పుడు చేతులెత్తేస్తున్నది. మ్యానిఫెస్టోలో ఆరు గ్యారెంటీలు ప్రకటించి, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలన పేరిట దరఖాస్తులు స్వీకరించి, తీరా అమలు చేసేందుకు అనేక కండిషన్లు పెడుతున్నది. ఈ ఎనిమిది నెలల్లో ఒకటి, రెండు పథకాలను అమలు చేయడమే తప్ప, మెజార్టీ గ్యారెంటీలను విస్మరించింది. నెలలు గడుస్తున్నా దరఖాస్తులు పరిష్కారం కాక అర్జీదారులు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఏర్పడుతున్నది. ఇప్పటికైనా స్పందించి, అర్హులందరికీ పథకాలు వర్తింపజేయాలనే డిమాండ్ వినిపిస్తున్నది.**



పెద్దపల్లి మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన గ్రీవెన్స్ సెల్

పెద్దపల్లి, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): ప్రజాపాలనలో గ్యారెంటీల కోసం ప్రభుత్వం గతేడాది డిసెంబర్, జనవరి మొదట్లో ప్రజాపాలన పేరిట ఆరు రోజుల పాటు దరఖాస్తులు స్వీకరించింది. పెద్దపల్లి జిల్లాలోని 13మండలాలు, ఒక కార్పొరేషన్, మూడు మున్సిపాల్టీల నుంచి మొత్తంగా 2,40,667 దరఖాస్తులు అందాయి. ఆ తర్వాత తిరిగి ప్రజాపాలన దరఖాస్తు కేంద్రాలను ఏర్పాటు చేసి గ్యాస్ సబ్సిడీ, ఉచిత విద్యుత్ కోసం 23,396 దరఖాస్తులను పరిశీలించి గ్యాస్ అకౌంట్ నంబర్లను, విద్యుత్ యూఎస్‌సీ నంబర్లను సరిచేశారు. ఇవి తప్ప ఇతర దరఖాస్తులన్నీ బుట్టదాఖలయ్యాయనే విమర్శలు ఉన్నాయి. మహాలక్ష్మి పథకంలో మహిళలకు ప్రతి నెలా ₹2500 జీవన భృతి కోసం 19,9571మంది, ₹15వేల రైతు భరోసా కోసం 88,011 మంది రైతులు, 11,374మంది కౌలు రైతులు, రైతు కూలీలకు ఏడాదికి ₹12వేల సాయం కోసం 1,02,364మంది, గృహలక్ష్మి పథకం కింద ఇండ్ల కోసం 1,85,404మంది, 250 గజాల ఇంటి స్థలం కోసం 403 మంది అమరవీరుల కుటుంబాలు, 2707మంది ఉద్యమకారులు, చేయూత పథకం కింద సాయం 6979 మంది, ఇతర పెన్షన్ల కోసం 49,552, కొత్త రేషన్ కార్డులకు సంబంధించి 15,670 మంది చేసుకున్న దరఖాస్తులన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి.

### కాళ్లరిగేలా తిరిగినా ఫలితం శూన్యం

ప్రజా పాలనల దరఖాస్తుల డేటా ఎంట్రీలో చాలా వరకూ లోపాలు దొర్లాయి. దీంతో అర్హులైన అనేక మందికి ప్రభుత్వ పథకాలు అందకుండా పోయాయి. పరిష్కారానికి ప్రభుత్వం జిల్లాలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయాలు, రామగుండం కార్పొరేషన్, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలతో పాటు కలెక్టరేట్ కార్యాలయంలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే సదరు కేంద్రాలు కేవలం దరఖాస్తులు స్వీకరించి, ఆన్‌లైన్ చేయడం తప్ప, పథకాలు మాత్రం అమలు చేయలేదు. దీంతో ఆరు గ్యారెంటీల కోసం వేలాది మంది దరఖాస్తుదారులు ఎదురు చూస్తున్నారు. ప్రజావాణితో పాటు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. గ్యాస్ సబ్సిడీ, ఉచిత విద్యుత్ మినహా ఇతర ఏ ఒక్క హామీ అమలు కాకపోవడంతో అమలు చేస్తరా..? లేదా .. ఉత్తమాటలేనా..? అని చర్చించుకుంటున్నారు. అన్ని అర్హతలున్నా ఎందుకు అమలు చేయడం లేదని వాపోతున్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం హామీలన్నీ నెరవేర్చాలని కోరుతున్నారు.

### నిర్లక్ష్యం.. మహిళకు శాపం

'మంథని మున్సిపాలిటీ పరిధిలోని ఎరుకలగూడెంకు చెందిన ఓ మహిళ ఆరు గ్యారెంటీల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న. తన కుటుంబ సభ్యులతో ఉన్న రేషన్ కార్డు, కరెంట్ బిల్లు, గ్యాస్ సిలిండర్ బుక్ జిరాక్స్ ప్రతులతో పాటు పూర్తి వివరాలతో ప్రభుత్వానికి సమర్పించింది. అధికారుల నిర్లక్ష్యంతో ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదు చేయడంతో పథకాలు అందకుండా పోయాయి. అయితే కొద్దిరోజుల క్రితం మంథని మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రజాపాలన కేంద్రాన్ని ప్రారంభించడంతో తనకు గృహజ్యోతి, ₹500కే గ్యాస్ పథకాలను వర్తింపచేయాలని పలుసార్లు దరఖాస్తు చేసుకున్నది. కానీ ప్రయోజనాలు మాత్రం దక్కడంలేదు. ఇప్పటికీ నెల నెలా కరెంట్ బిల్లు వస్తున్నదని, గ్యాస్ సబ్సిడీ రావడం లేదని సదరు మహిళ వాపోతున్నది.



ఇల్లంతకుంట మండలం తిప్పాపూర్ పంప్‌హౌస్ డెలివరీ సిస్టర్న్ నుంచి వస్తున్న గోదారి జలాలు


# అన్నపూర్ణవైపు గోదావరి జలాలు

- నంది, గాయత్రీ పంప్‌హౌస్‌లలో నిరంతర పంపింగ్
- లింక్-2లో ఎల్లంపల్లి నుంచి మధ్యమానేరుకు ఉరకలు
- అన్నపూర్ణ జలాశయానికి ఎత్తిపోతలు మొదలు
- హరీశ్‌రావు లేఖతో దిగొచ్చిన సర్కారు

ధర్మారం/రామడుగు/బోయినపల్లి/ ఇల్లంతకుంట, ఆగస్టు 5: కాళేశ్వరం నుంచి గోదావరి జలాలు ఎత్తిపోసి సాగునీరిచ్చే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తాత్సారం చేస్తున్నది. వర్షాభావ పరిస్థితులు, అడుగంటిన జలాశయాలు ఫలితంగా వానకాలం సాగుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ఈ క్రమంలో రైతుల గోసను మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు సిద్దిపేట జిల్లాలోని అన్నపూర్ణ, రంగనాయక, మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్లను నింపి రైతులకు సాగునీరివ్వాలని ఆయన శనివారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాశారు. దాంతో సాగునీటి పారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా స్పందించి, మిడ్ మానేరు ద్వారా సిద్దిపేట జిల్లాలోని రిజర్వాయర్లకు నీటిని ఎత్తిపోస్తామని చెప్పారు. ఆ మేరకు సోమవారం ఇల్లంతకుంట మండలం అనంతగిరిలోని అన్నపూర్ణ ప్రాజెక్టుకు ఎత్తిపోతలు ప్రారంభించారు. మధ్యమానేరు నుంచి అండర్ టన్నెళ్ల ద్వారా తిప్పాపూర్‌లోని సర్జ్‌పూల్‌కు జలాలు చేరుతుండగా, ఇక్కడి పంప్‌హౌస్‌లో రెండు బహుబలి మోటర్లను సోమవారం ఆన్ చేశారు. ఒక్కో మోటర్ ద్వారా 3,220 క్యూసెక్కుల చొప్పున 6,440 క్యూసెక్కులు అన్నపూర్ణ జలాశయానికి తరలిస్తున్నట్టు ఏఈ సమరసేట తెలిపారు. కాగా, మాజీ మంత్రి హరీశ్ రావు, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి అన్నపూర్ణ జలాశయానికి విడుదల చేయాలని కోరిన మూడు రోజులకే ప్రభుత్వం స్పందించి నీటిని విడుదల చేయగా, రైతులు సంబురపడుతున్నారు.

### కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఎల్లంపల్లి నుంచి మధ్యమానేరు జలాశయానికి పరవళ్లు తొక్కిన గోదారి, సోమవారం అన్నపూర్ణ జలాశయం వైపు సాగింది. తిప్పాపూర్ పంప్‌హౌస్ నుంచి పంపింగ్ మొదలైంది. పది రోజులుగా కాళేశ్వరం లింక్–2లో ఎత్తిపోతలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. సోమవారం కూడా ధర్మారం మండలం నంది మేడారంలోని నంది పంప్‌హౌస్‌లో నాలుగు మోటర్లు నడిపించారు. ఒక్కో మోటర్ ద్వారా 3,150 చొప్పున 12,600 క్యూసెక్కులు డెలివరీ సిస్టర్న్‌ల ద్వారా ఎగిసి పడి నంది రిజర్వాయర్‌లోకి చేరుతున్నాయి. ఇక్కడ 10 గేట్లను ఎత్తడంతో గ్రావిటీ కాల్వ ద్వారా జంట సొరంగాలకు చేరి అక్కడి నుంచి 7, 8 ప్యాకేజీలలోని కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంప్‌హౌస్‌కు తరలిపోతున్నాయి. అక్కడి నుంచి సైతం నాలుగు మోటర్ల ద్వారా 12,600 క్యూసెక్కులు లిఫ్ట్ చేస్తుండగా, డెలివరీ సిస్టర్న్‌ల ద్వారా ఎగిసి పడ్డ జలాలు సుమారు 5.7 కిలోమీటర్లు ఉన్న గ్రావిటీ కాలువ ద్వారా ప్రవహించి వరదకాలువలో 99వ కిలోమీటర్ మైలురాయి వద్ద కలుస్తున్నాయి. అక్కడి నుంచి మధ్యమానేరుకు పరుగెడుతున్నాయి. సోమవారం వరకు సుమారు 10 టీఎంసీలకుపైగా గోదారి జలాలను మధ్యమానేరుకు తరలించినట్టు ప్రాజెక్టు డీఈఈ రాంప్రదీప్ తెలిపారు. కాగా, ఎత్తిపోతల ద్వారా పెద్ద ఎత్తున వరద వచ్చి చేరుతున్న నేపథ్యంలో మధ్యమానేరులో నీటి మట్టం గంట గంటకు పెరుగుతున్నది. పూర్తి నీటి సామర్థ్యం 27.054 టీఎంసీలుకాగా, ప్రస్తుతం 16.215 టీఎంసీలు ఉంది.



రామడుగు : శ్రీరాములపల్లి సమీపంలో వరదకాలువ 99 కిలోమీటర్ నుంచి మధ్య మానేరుకు తరలుతున్న జలాలు